పర్యావ'రణం'

- అంతరించిపోతున్న అడవులు...
- పెరుగుతున్న కాలుష్యం..
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

7

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రచారం

మంచిర్యాలక్రైం, జూన్4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ అడ్మిషన్లకోసం అధ్యాపకులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా అధ్యాపకులు ఈ విద్యా సంవత్సరానికి కౌటాల, బెజ్జూర్ దహెగాం, పెంచికల్ పేట్, డబ్బ పరిసర ప్రాంతాల్లో అడ్మిషన్ల కార్యక్రమం చేపట్టారు. వివిధ కోర్సులో అందుబాటులో ఉండే వసతులు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల గురించి కళాశాల అధ్యాపక బృందం అనుభవాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీకళాశాల అధ్యాపకులు కుమారస్వామి, మహేశ్‌కుమార్, ఎండీరసూల్, ఎన్.రమణ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మంచిర్యాలక్రైం, జూన్4 (ఆంధ్ర జ్యోతి): యోగాతో సంపూర్ణఆరోగ్యం పొంద వచ్చునని ఆయుష్ యోగా ఇన్‌స్ట్రక్టర్ సుధాకర్ అన్నారు. అంతర్జాతీయ దశాబ్ధిఉత్సవాల్లో బాగంగా యోగా పోటీలను బాయ్స్ హైస్కూల్‌గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈపోటీల్లో విద్యార్థులతో పాటు పెద్దలకు పోటీలు నిర్వహించారు. పలువురు యోగా విన్యాసాలతో అలరించారు. యోగాలో గెలిపొందిన వారికి జూన్21న బహుమతులు అందజేస్తామన్నారు. ఆయుష్ డాక్టర్ పద్మజ, మేఘన, సుధీర్ పాల్గొన్నారు.

7న ఉచిత వైద్య శిబిరం

మంచిర్యాలకలెక్టరేట్, జూన్4 (ఆంధ్రజ్యోతి): ఇండి యన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఆర్‌వీఎం ఆసుపత్రి సిద్దిపేటవారి సహకారంతో ఈనెల 7న శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఫారెస్టు కాంట్రాక్టర్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటలకు ఉంటుందని తెలిపారు. శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గుండెజబ్బుల వైద్యనిపుణులు, క్యాన్సర్ వైద్య నిపుణులు, జనరల్ ఫిజిషియన్, నరాల వైద్యనిపుణులు, జనరల్ సర్జన్, జీర్ణకోశవ్యాధి నిపుణులు, రేడియాలజిస్టు, మూత్రపిండాల వ్యాధినిపుణులు ఉంటారన్నారు. పలు రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు దీనిని జిల్లా పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు ప్రోగ్రాం ఆరనైజర్ వి.మధుసూదన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మహేందర్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా ప్రైవేట్ బడులు



- కనీస నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- బహుళ అంతస్తుల భవనాల్లో విద్యాలయాల ఏర్పాటు
- ఆటస్థలం ఉండాలన్న నిబంధనలు గాలికి
- అర్హతలేని ఉపాధ్యాయులచే విద్యాబోధన

మంచిర్యాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవే ట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్రధాన పట్టణాల్లో గల్లీ గల్లీకి పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి, అర్హత లేని వారు సైతం పాఠశాలలు నెలకొల్పుతూ అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వ్యా పార దృక్పథంతో రోజురోజుకూ జిల్లా వ్యాప్తంగా ప దుల సంఖ్యలో పాఠశాలలు ప్రారంభం అవుతున్నా వి ద్యాశాఖాధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 12 నుంచి నూత విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యం లో పాఠశాలలు స్థాపించి ప్రచార హోరు మోగిస్తున్నా రు. ఇరుకుల గదుల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండానే పాఠశాలలను నెలకొల్పుతున్నారు. ఇతరత్రా రంగాలకు చెందిన వ్యాపారులు సైతం ప్రాముఖ్యత(బ్రాండెడ్) కలిగిన సంస్థల పేర్లను ఉపయోంచి పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రభుత్వ గుర్తింపు లేకున్నా...

జిల్లాలో నూతనంగా నెలకొలుపుతున్న కొన్ని పాఠశాలలకు ప్రభుత్వ పరంగా ఎలాంటి గుర్తింపు లేకున్నా అడ్మిషన్లు సేకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. విద్యాశాఖ నిబంధనల ప్రకారం మొదట ప్రారంభ అనుమతి పొందిన పిదప పాఠశాలలను ఏర్పాటు చేయాలి. అందుకు భిన్నంగా ప్లే స్కూళ్లు, కిడ్స్ స్కూళ్ల పేరిట కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యాశాఖ నిబంధనలివీ..

పాఠశాలను ప్రారంభించేముందు విద్యాశాఖకు చలానా రూపంలో తనిఖీ రుసుం చెల్లించి నిబంధనల మేరకు ఓపెనింగ్ అనుమతులు పొందాలి. అనంతరం పాఠశాల ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు, బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలి. అన్ని వసతులు కల్పించినట్లు ప్రతిపాదనలు తయారుచేసి శాశ్వత గుర్తింపు కోసం ఫైల్ విద్యాశాఖకు అందజేయాలి. దరఖాస్తు సమయంలో రూ. 50వేలు ఎండోమెంట్ రుసుము చెల్లించాలి.

- విద్యార్థులు ఆడుకోవడానికి పాఠశాలకు అనుసందానంగా పట్టణ ప్రాంతాల్లో 1000 చదరపు మీటర్లు, గ్రామీణ ప్రాంతాల్లో 2000 చదరపు మీటర్ల ఆట స్థలం కలిగి ఉండాలి.
- అగ్నిమాపకశాఖ అనుమతి తీసుకొని ఉండాలి. ప్రతి పాఠశాలలో అగ్నిమాపక పరికరాలు (ఫైర్ ఎస్టింగిషర్స్, అలారం) అందుబాటులో ఉండాలి.
- పాఠశాల భవన స్థితిగతులతోపాటు విద్యార్థుల ఆరోగ్యం కోసం ధారాళంగా గాలి, వెలుతురు సౌకర్యాలు ఉన్నట్లు సూచించే సౌండ్‌నెస్, శానిటరీ సర్టిఫికేట్లు వి ద్యాశాఖ అధికారులకు అందజేయాలి.
- పాఠశాలల్లో విద్యాబోధన చేసే ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఇంటర్‌తో పాటు టీటీసీ లేదా డిగ్రీ అనంతరం బీఈడీ శిక్షణ పొంది ఉండాలి. వ్యాయామ ఉపాధ్యాయులైతే బీపీఈడీ శిక్షణ పొంది ఉండాలి.
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా టాయ్‌లెట్ల సౌకర్యం కల్పించాలి.
- తరగతి గదులు విద్యార్థులకు అనుగుణంగా విశాలంగా ఉండటంతోపాటు గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే వెసులుబాటు కలిగి ఉండాలి.
- విద్యార్థుల మేధాశక్తి కోసం పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేయాలి. అందులో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచాలి.
- పాఠశాలలో తప్పనిసరిగా కంప్యూటర్, టీవీ, రేడియో వంటి ప్రసార సాధనాలు అందుబాటులో ఉండా లనే నిబంధనలున్నా చాలా పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యాబోధన జరుగుతోంది.

అర్హతలేని ఉపాధ్యాయులతో విద్యాబోధన..

ప్రైవేట్ పాఠశాలల్లో చాలా వాటిలో అర్హతలేని ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నట్లు సమాచారం. చాలా పాఠశాలల్లో కేవలం ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హతలు ఉన్నవారిని..

మిగతా 7లో

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నస్పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవలేబుల్ స్కూల్ పెండింగ్ బిల్లులు, పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని మాదిగస్టూడెంట్ ఫోరం జిల్లా ఇంచార్జీ కోంద్రఉదయ్ డిమాండ్ చేశారు. నస్పూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ దళిత విద్యార్థుల పట్ల ప్రభుత్వం చిన్న చూపుచూస్తుందన్నారు. బెస్ట్ అవలేబుల్ స్కూల్స్‌లో బకాయిలను ఇంకా విడుదల చేయలేదన్నారు. స్కాలర్‌షిప్ కూడ పెండింగ్‌లోనే ఉన్నాయని, ఫీజు రీయంబర్స్‌మెంట్ గత మూడు సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్ విడుదలకాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీపల్లి షాజన్, విజయ్, రిషి మాదిగ, అరుణ్ మాదిగలు పాల్గొన్నారు.

'బడిబాట' విజయవంతం చేయాలి

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 6 నుంచి తలపెట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ అన్నారు. బుధవారం జిల్లాలోని గిరిజన అభివృద్ధిశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏటీడీవో పురుషోత్తంతో కలిసి వసతి గృహాల సంక్షేమాధికారులు, ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 6న అన్నిగ్రామాల్లో, మున్సిపాలిటీలలో బడిబాట కార్యక్రమం ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలపై గ్రామ సభలు నిర్వహించి బడి బయట ఉన్న పిల్లలు, ఐదేళ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరిని పాఠశాలలో చేర్పించే విధంగా కార్యాచరణ చేపట్టాలన్నారు. స్వయం సహాయక సంఘాలు, ఏఏపీసీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వసతీగృహాల సంక్షేమఅధికారులు, పాత విద్యార్థుల భాగస్వామ్యంతో మరుమూల ప్రాంతాలల అవగాహన కల్పించాలన్నారు. ప్రతిజ్ఞ బడిబాట ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. ఇంటింటికి సందర్శించి బడి వయస్సు పిల్లలను నమోదు చేయాలని తెలిపారు.

తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ప్రజాప్రతి నిధులను భాగస్వామ్యం చేయాలని, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో విద్యా సంబంధిత అంశాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యల పరిష్కారం

- కలెక్టర్ కుమార్ దీపక్



భీమారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యల పరిష్కారమవుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మిట్టపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనా రాయణలతో కలిసి సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈ దరఖాస్తులను రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధి కారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 20 వరకు జిల్లాలో భీమారం మినహా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

భీమారం : భూభారతి చట్టంలో భాగంగా పైలెట్ మండలంగా ఎంపికైన భీమారం మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం భీమారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భీమారం మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపికచేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించిన భూ సమస్యల దరఖాస్తులను స్వీకరించామన్నారు. స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. తిరస్కరించబడిన దర ఖాస్తులకు సంబంధించి వివరాలు పరిశీలించి అధికారులకు తగు సూచ నలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ప్రత్యేక తహసీల్దార్ జ్యోతి, రాంచందర్‌లు ఉన్నారు.

పేదలకు అండగా ఉండేది కాంగ్రెస్

ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఇండ్ల స్థలాల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

జన్నారం,జూన్4(ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభు త్వమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. మండలంలోని పేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మించి ఇవ్వడం ప్రభుత్వం బాధ్యత అని గత ప్ర భుత్వాలు ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. మంజూరైనప్రతి పేద కుటుంబం ఇళ్ల నిర్మించుకోవాలని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అదే విధంగా ఇటీవల ఏడీసీసీ బ్యాంక్ పొన్కల్ సింగిల్ విండో సొసైటీలో సభ్యులైన రైతు పంబాల నాగమల్లేశ్ పంటరుణం పొంది చనిపోయాడు. అతడి భార్య రాజేశ్వరికి ఏడీసీసీ బ్యాం క్ మేనేజర్ స్వాతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ మంజూరైన రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, నాయకులు అల్లం రవి, ముజాఫర్ అలీ, సయ్యద్ ఫసియుల్లా, మాణిక్యం, మోహన్ రెడ్డి, సుభాష్‌రెడ్డి, ముత్యం సతీష్, సయ్యద్ ఇసాక్, దాముక కరుణాకర్‌లతో పాటు దుమ్మల రమేశ్‌లు పాల్గొన్నారు.

కేంద్రం ఆపరేషన్ కగార్‌ను విరమించుకోవాలి

- అఖిలపక్ష నాయకుల డిమాండ్



కగార్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్న అఖిలపక్షం నాయకులు

మంచిర్యాలక్రైం, జూన్4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరుపాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని అఖిలపక్షం నాయకులు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నరేశ్, సీపీఐ ఎంఎల్ అధ్యక్షులు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు గాదె సత్యం, సీపీఐ కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అటవీసంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం బూటక ఎన్‌కౌంటర్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. 2026 సంవత్సరం నాటికి మావోయిస్టు పార్టీని పూర్తిగా లేకుండా చేయాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం నరమేధానికి పాల్పడుతోందన్నారు. ఈ బూటకు ఎన్‌కౌంటర్‌లో అనేక మంది మావోయిస్టులు మృతి చెందారని ఇప్పటికే సుమారు 500మంది మావోయిస్టులు మృతి చెందారని, మావోయిస్టులతో పాటు అమాయక ఆదివాసీలను కూడ బలిగొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు విధానాన్ని అమలు చేస్తుందన్నారు.

అదాని, అంబాని ధన దాహం కోసం బీజేపీ సర్కార్ ప్రజలను, ప్రజానాయ కులను చంపడం ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేణు, బీఆర్ఎస్ నాయకులు కర్రెశంకర్, నాయకులు బలికొండ రమేశ్, సీపీఐ నాయకులు లక్ష్మణ్, చంద్రశేఖర్, ఖలీందర్, న్యూడెమోక్రసీ నాయ కులు లాల్‌కుమార్, మేకల రామన్న, జాడి దేవరాజ్, తుడుం దెబ్బ నాయకులు గంట సత్యం, టీపీఎఫ్ నాయకులు జైపాల్‌సింగ్, ఏఐఎఫ్‌టీయు నాయకులు పోచమల్లు, దేవి సత్యం పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మంచిర్యాలక్రైం, జూన్4 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలకు చట్టాలపై అవగాహన కల్పించ బాధ్యత ఉపాధ్యాయులకు ఉందన్నారు. శిక్షణ తరగతుల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ బాలబాలికలను, యువకులను వలలో వేసుకోవడానికి కొందరు వేధింపులకు గురి చేస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ ట్రాఫికింగ్ నేడు వ్యవస్థ పూర్తిగా నేరాలుగా మారాయన్నారు. విద్యార్థులను చైతన్య వంతులను చేయాలని సూచించారు. తరుచూ తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి జాగ్రత్తలపై అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ కోర్సు కోఆర్డినేటర్ యశోధర, క్వాలిటి కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, ప్రజ్వల్, రాజ్, అనిల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



విగ్రహాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

హాజీపూర్, జూన్4 (ఆంధ్రజ్యోతి): నంనూర్ పునరావాసకాలనీలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం రెండో రోజు అంగరంగవైభవంగా జరిగింది. అచ్చలాపూర్ వేదపాఠశాల పండితులు ముద్దు దీరజ్ అవధాని ఆధ్వర్యంలో పది మంది వేదపండితులు రెండవ రోజు సామూహిక హోమ కార్యక్రమాలు నిర్వహించారు. 20 మంది దంపతులు ఈ హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఉత్సవమూర్తుల విగ్రహాలకు అభిషేకాలు చేయించారు. భక్తులు పంచామృతాలతో ఆలయానికి చేరుకొని నూతనంగా నిర్మించబోయే విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన దాత ఆన్‌కారి పద్మశ్రీ సత్యనారాయణ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో పాల్గొన్న అభ్యర్థులు

మంచిర్యాలక్రైం,జూన్4 (ఆంధ్రజ్యోతి): శ్రీహర్ష కళాశాలలో తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్స్ అండ్ డెవలప్‌మెంట్ నాలెడ్జ్ టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు భారీ స్పందన లభించింది. బుధవారం కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు 368 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 196 మంది ఉద్యోగాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పల్లె భూమేశ్ మాట్లాడుతూ అడుగగానే టాస్క్ సౌజన్యంతో మెగా జాబ్‌మేళాను నిర్వహించినందుకు ఆదిలాబాద్ ఇన్‌చార్జి దీపను ప్రత్యేకంగా అభినందించారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు మంచి అవకాశం లభించిందన్నారు. శ్రీహర్ష డిగ్రీకళాశాల ఆధ్వర్యం లో నిర్వహించినందుకు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కంపెనీల హెచ్‌ఆర్‌లతో పాటు కళాశాల డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, శ్రావణ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత ఠాకూర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతి

మంచిర్యాలకలెక్టరేట్, జూన్4(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ పట్టణ అధ్యక్షులు అమిరిశెట్టి రాజుకుమార్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వివిధ వార్డుల్లో డ్రైనేజీలు సక్రమంగా క్లీన్ చేయకపోవడం వల్ల వాటర్ రోడ్లమీదకు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వార్డుల్లో చెత్తకుండీలను ఏర్పాటు చేయకపోవడం వల్ల చెత్తను రోడ్లపైనే వేయడంతో పారిశుధ్యం లోపిస్తుందన్నారు. కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బీజేపీ నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, ఆకుల అశోక్‌వర్ధన్, జోగుల శ్రీదేవి, కర్రి లచ్చన్న, గాజుల ప్రభాకర్, రాజబాబు, నాగుల రాజన్న, రాకేశ్ రెన్వా, రెడ్డిమల్ల అశోక్, విజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి ఫైర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

మంచిర్యాలకలెక్టరేట్, జూన్4 (ఆంధ్రజ్యోతి): ఆకస్మత్తుగా మంటలు చెలరేగినప్పుడు వాటిని ఎలా ఆర్పాలి అనే విషయంపై బుధవారం పాత మంచిర్యాలలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మంచిర్యాల ఫైర్ ఆఫీసర్ రమేశ్ విద్యుత్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకస్మత్తుగా మంటలు చెలరేగినప్పుడు ఆ మంటలను ఐదు రకాలుగా ఆర్పవచ్చునని తెలిపారు. వాటిలో సీఓటు, డీసీ టైపును ఉపయోగించి సబ్‌స్టేషన్‌లో మంటలను ఆర్పవచ్చునని సూచించారు. ఆయిల్‌తో కూడిన మంటలను ఎక్కువగా డీసీ ద్వారా మంటలను ఆర్పవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డివిజన్ ట్రాన్స్‌కో ఎస్ఈ వెంకటేశ్వరరావు, డీఈ రామ్‌టెన్‌కి గులాబ్, ట్రాన్స్‌కో ఏడీఈ రాజ్ కుమార్, ఏడీఈలు ఆడే గోపాల్, రాజేశ్, ఎండీ కైసర్, ఏఈలు వేముల మౌనిక, రమ్య, మనోహర్, జేఎల్ఎంలు, ఆర్టిజన్స్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీ



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మందమర్రిటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పార్ల మెంట్ అభివృద్ధికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంద తిరుమల్, పైడిమల్ల నర్సింగ్‌లు తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బీ1క్యాంపు కార్యాలయం వద్ద ఎంపీ వంశీకృష్ణ ఎంపీగా సంవత్సరం పూర్తయిన సందర్భంగా సంబరాలను నిర్వహించారు. కేక్ కట్ చేశారు. ప్రజల సమస్యలపై పార్లమెంట్‌లో ఎంపీ ప్రశ్నిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తయ్య, నర్సయ్య, రాజు, ఇసాక్, శంకర్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ఏడాది క్రితం ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపీగా ఘన విజయం సాధించిన గడ్డం వంశీక్రిష్ణ ప్రజాసేవలో ముందుకు వెళ్తున్నారని మాల మహానాడు జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి అన్నారు. బుధవారం అంబేద్కర్ చౌరస్తావద్ద పెద్దపల్లి ఎంపీగా ఎన్నికై ఏడాది కాలం పూర్తి చేసు కున్న సందర్భంగా నాయకులు కేక్‌కట్‌చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సబ్బని రాజనర్సు, రాజేశ్వర్, శ్రీనులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలి



ఆసిఫాబాద్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కాగజ్‌నగర్/బెల్లంపల్లి/ఆసిఫాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులను ప్రజలే కాపాడుకోవాలని పౌర స్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. బుధవారం తెలంగాణ పౌర స్పందన వేదిక ప్రచార జాతాలో భాగంగా కాగజ్‌నగర్, బెల్లంపల్లి, ఆసిఫాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. బడీఈడు పిల్లల సంఖ్య ఆధారంగా గ్రామీణ ప్రాంతంలో పాఠశాలన్ని రీ ఆర్గనైజ్ చేయాలన్నారు. ధార్మిక సంస్థలు ఏర్పాటు చేసిన ఎయిడెడ్ పాఠశాలల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పౌర స్పందన వేదిక నాయకులు మంగ, నాగమణి, ధనమూర్తి, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.రాజకమలాకర్ రెడ్డి, నాయకులు మహేష్, సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ముంజం ఆనంద్ కుమార్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కోట శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికృష్ణ, దివక్, టీఎస్‌యూటీఎఫ్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యం: ఎమ్మెల్యే వివేక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

మందమర్రి టౌన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ఏది ఆశించకుండా నిస్వార్థమైన ప్రజాసేవ చేయడమే తమ లక్ష్యమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ గెలుపొంది సంవత్సరం పూర్తయిన సందర్భంగా బుధవారం పట్టణంలో వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా వివేక్ మాట్లాడుతూ పెద్దపల్లిలో కాంగ్రెస్ పార్టీ నుంచి మూడో తరం నాయకుడిగా తన తనయుడు వంశీకృష్ణ గత పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించాడని తెలిపారు. సింగరేణి అధికారులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి నూ తన గనుల కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండి సదానందం, రాచర్ల గణేష్, ఎండీ ఇస్సాక్, జావేద్‌ఖాన్, రాయబారపు కిరణ్, రావికంటి వెంకటేషం, వేణు, రాంరెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

నర్సరీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

రెబ్బెన, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నర్సరీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లింపులు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీ కార్మికులకు జీతాల చెల్లింపులు సక్రమంగా చేయటం లేదన్నారు. జీతాలు పెండింగ్‌లో ఉంటున్నట్టు వివరించారు. జీతాల చెల్లింపులు చేయకుండా తిప్పించుకుంటున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జీతాలు వెంటనే ఇచ్చేట్టు చూడాలని కోరారు. సమావేశంలో నర్సరీ కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో గ్రంథాలయం

- రెబ్బెనలో గ్రంథాలయ భవన నిర్మాణం ఎప్పుడో..?
- వివాదంలో మగ్గుతున్న స్థలం
- పక్కా భవనం లేక ఇబ్బందులు
- ప్రస్తుతం కమ్యూనిటీ భవనంలోనే కొనసాగింపు



కమ్యూనిటీ భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం

రెబ్బెన, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రంథాలయాలు మౌలిక వసతుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. పక్కా భవనాలు, సరిపడా గదులు, సామాగ్రి లేక పోవటంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోవటం లేదు. దీంతో రోజురోజు గ్రంథాలయాలకు వచ్చే పాఠ కుల సంఖ్య తగ్గిపోతోంది. గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించి పాఠకులకు సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దాల్సిన అధికారులు కూడా పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

● సరిపడాలేని కుర్చీలు, టేబుళ్లు

రెబ్బెన మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని 1991లో ప్రారంభించారు. అప్పట్లో గ్రంథాలయానికి పక్కాభవనం అందుబాటులో లేకపోవటంతో తాత్కాలికంగా కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కమ్యూనిటీ భవనంలోనే గ్రంథాలయం కొనసాగుతోంది. పక్కాభవనం ఏర్పాటు కోసం పాఠకు లు అనేక సార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. మండల కేంద్రంలోని గ్రంథాలయానికి ప్రతిరోజు 80నుంచి 100 మంది వరకు పాఠకులు వస్తున్నారు. సుమారు 490 మంది డిపాజిట్‌దారులు ఉన్నారు. పక్కా భవనం లేకపోవటంతో ఇరుకు గదుల్లోనే పాఠకులు సతమతమవుతున్నారు. గ్రంథాలయంలో కేవలం రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉండగా, ఒక గదిని పాఠకుల కోసం మరో గదిని స్టోర్ రూం కోసం కేటాయించారు. కనీసం పాఠకులకు కుర్చీలు, టేబుళ్లు సైతం సరిపడా లేకపోవటంతో అనేక అవస్థలు పడుతున్నారు. గ్రంథాలయంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉపయోగపడే పుస్తకాలతో పాటు సుమారు 4,732లకుపైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అయినా వసతులు లేని కారణంగా చాలా మంది విద్యావంతులు, విద్యార్థులు గ్రంథాల యం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

● నిధులు వెనక్కి..

గ్రంథాలయం కోసం మండల కేంద్రానికి చెందిన ఓ దాత గుంట స్థలాన్ని 1997లో దానం చేశారు. అయితే ఆయన మరణానంతరం ఆయన వారసులు గ్రంథాలయానికి ఇచ్చిన స్థలం తమకే చెందుతుందని కోర్టును ఆశ్రయించారు. ఏళ్లగడుస్తున్నా స్థల వివా దం ఎటూ తేలకపోవటంతో పక్కా భవన నిర్మాణా నికి అడుగులు పడటం లేదు. గతంలో గ్రంథాలయ పక్కా భవన నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేయగా స్థలం అందుబాటులో లేని కారణంగా నిధులు వెనక్కి మళ్లిపోయాయి. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవటంతో పక్కా భవన నిర్మాణం కలగానే మిగింది.

పక్కా భవనం నిర్మించాలి..

-వినోద్ జైశ్వాల్, రెబ్బెన



మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మించాలి. ప్రస్తుతం కొనసాగుతున్న భవనంలో సరైన వసతులు లేవు. ఇరుకైన గదులతో ఇబ్బందికరంగా ఉంది. పక్కా భవనం నిర్మించి సౌకర్యాలు మెరుగుపర్చాలి. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అధికారులు ఈ దిశగా వెంటనే తగిన చర్య లు చేపట్టి గ్రంథాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

-ఎం.స్వర్ణలత, లైబ్రేరియన్, రెబ్బెన



రెబ్బెన గ్రంథాలయంలో పలు సమస్యలు నెలకొన్నాయి. ముఖ్యంగా వర్షాకాలం స్లాబ్‌పై నుండి నీరు పడుతుండటంతో లైబ్రరీలోని పుస్తకాలు తడిసి పోతున్నాయి. లైబ్రరి మొత్తం నీటితో నిండుతుంది. దీంతో పాఠకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుస్తకాలు జాగ్రత్తపరచటం కూడా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు స్పందించి కొత్తగా లైబ్రేరిని నిర్మిం చాల్సిన అవసరం ఉంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరించటం జరిగింది.

అటవీ అధికారులపై కేసు నమోదు చేయాలి

జైపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన దళిత రైతులపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపిన అటవీ శాఖ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ పేర్కొన్నారు. బుధవారం జైపూర్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ వెంకటేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్గం తిరుపతి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, నాయకులు కేశవరెడ్డి, రాజులాల్ యాదవ్, శివయ్య పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

జైపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గంగిపెల్లి నుంచి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు.

ఆదివాసీ విద్యార్థిని క్రీడల్లో రాణించడం అభినందనీయం



విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజి విద్యార్థిని సెడం సుహాసిని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన సౌత్ ఆసియా చాంపియన్‌షిప్ అత్యాపత్య క్రీడల్లో ఇండియా తరఫున ఆడి గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం విద్యార్థినిని తన కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం గొప్ప విషయమని ఎస్పీ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పెంచికలపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెడ్వాయి గ్రామంలో వెన్నంపల్లి ప్రకాష్ అనే రైతుకు చెందిన గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బాధిత రైతు వివరాల ప్రకారం... బుధవారం ఉదయం తేలిక పాటి వర్షం కురిసింది. ఆ సమయంలో తన ఇంటి ముందు 11 కేవీ విద్యుత్ తీగ తెగింది. దీంతో ఎర్త్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదవ శాత్తు స్తంభానికి తాకి గేదె మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరారు. ఏఈ అంజల్‌కుమార్‌ని వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదిక అందించి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



శివరాం (ఫైల్)

చింతలమానేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన లెండుగురె శివరాం(36) లనే యువకుడు బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా ఆర్కేపీలో సింగరేణి ఉద్యోగం చేస్తున్నాడు. శివరాం అతడి భార్య స్నేహకు మధ్య తరుచుగా గొడవలు జరుగుతుండడంతో పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు సైతం జరిగాయి. అయినప్పటికీ గొడవలు సద్దుమగక పోవడంతో జీవితంపై విరక్తి చెంది గుర్తై బుధవారం తన స్వగ్రామంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు శివరాం తండ్రి ధర్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

రెబ్బెన, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓపెన్‌కాస్టు నుంచి మేనేజర్‌గా ప్రమోషన్‌పై భూపాలపల్లి ఏరియాకు వెళ్తున్న ఎ నారాయణను అధికారులు, నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అధికారి రజనికుమార్, సింగరణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి ఓదెలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సలేంద్ర సత్యనారాయణ

మందమర్రిటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్ ఆరోపించారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మందమర్రి ఏరియాలోని సింగరేణి ఏరియా ఆసుపత్రితో పాటు డిస్పెన్సరీలో అనారోగ్యం బారిన పడిన వారికి మందులు అందుబాటులో లేవన్నారు. గుండె, కిడ్నీ, లివర్, బీపీ, షుగర్ వ్యాధులకు సంబంధించిన మందులు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బయట డబ్బులు వెచ్చించి కొనుక్కునే పరిస్థితులు తలెత్తాయన్నారు. వెంటనే మందులను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ బాగుంటుందనే విషయాన్ని యాజమాన్యం మర్చిపోవద్దన్నారు. ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయాలను దారాదత్తం చేస్తున్న యాజమాన్యం మందులను కొనుగోలు చేయడంలో ఎందుకు శ్రద్ధ చూపడం లేదో తెలపాలన్నారు. మందులు లేవని బయట కొనుక్కోవాలని వైద్యులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పెద్దపల్లి బానయ్య, ఆంతోని దినేష్, సుద ర్శన్‌రెడ్డి, కుమార్, శర్మ, శ్రీనివాస్, తిరుపతి, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

శ్రమ ఎక్కువ..వేతనం తక్కువ

- దోపిడీకి గురవుతున్న సింగరేణి సులభ్ కార్మికులు - హక్కులకు దూరం... ఏళ్లుగా పోరాటం - నేడు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు(ఫైల్)

శ్రీరాంపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వారు నిరంతర శ్రామికులు. ఆదివారం.. పండుగలు వంటి సందర్భాల్లో సెలవులు లేవు. ప్రతీ నిత్యం పనిలో నిమగ్నం కావాల్సిందే. కానీ వచ్చే వేతనం మాత్రం అరకొరగా ఉంది. కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో తమ హక్కుల సాధనకు సింగరేణి సులభ్ కార్మికులు ఏళ్లుగా పోరాడుతున్నారు. ఈ క్రమంలోనే కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టనున్నారు.

● 30 ఏళ్లుగా సేవలు

సొంతిళ్లల్లో ఉండే సింగరేణి ఉద్యోగుల కోసం 30 ఏళ్ల క్రితం యాజమాన్యం వారి నివాసాలకు సమీపంలో సామూహిక మరుగుదొడ్లు నిర్మించింది. వీటి నిర్వహణ బాధ్యతను సులభ్ ఇంటర్నేషనల్ అనే ప్రైవేటు సంస్థకు అప్పగించింది. కాంప్లెక్స్‌ల వద్ద పనిచేసేందుకు భార్యా, భర్తలను నియమించి మొదట్లో 1,200 రూపాయల నుంచి 1,500 రూపాయల వరకు గౌరవ వేతనం ఇచ్చేవారు. ఆ తరువాత వేతనాలు పెంచి ఇద్దరికి ఇవ్వాలనే డిమాండ్ రావడంతో ఒక్కరికే పరిమితం చేశారు. ఆ సమయంలో అనేక మంది పనిచేసేవారు. కానీ ఇప్పుడు సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని సులభ్ కాంప్లెక్స్‌ల వద్ద 220 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

● తీసుకునేది ఎక్కువ... ఇచ్చేది తక్కువ

సింగరేణి యాజమాన్యం ద్వారా తమకు వేతన రూపేణా 25 వేల రూపాయలు వస్తున్నాయని, కానీ నిర్వహణ సంస్థ 15 వేలు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంటోందని సులభ్ కాంప్లెక్స్ వద్ద విధులు నిర్వహించే కార్మికులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పీఎఫ్ ఇవ్వరు.. బోనస్ రాదు

సింగరేణిలోని అన్ని విభాగాల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్, బోనస్ ఇస్తున్నారు. కానీ సులభ్ కాంప్లెక్సుల్లో పనిచేసే కార్మికులకు అవేమీ రావడం లేదు. చట్టప్రకారం 20 మంది కార్మికులు పనిచేస్తేనే సంబంధిత సంస్థ పీఎఫ్ చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ సీఎంపీఎఫ్/ఈపీఎఫ్ జాడ కనిపించడం లేదు. ఏడాదికాలంగా పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్ సొమ్మును ఇంతవరకు ఇవ్వలేదు. కాంట్రాక్టు కార్మికులకు బ్యాంకుల్లో వేతన ఖాతా కలిగి ఉంటే ప్రమాద బీమాను అమలు చేస్తున్నారు. కానీ సులభ్ కాంప్లెక్సుల కార్మికులకు మాత్రం ఆ సౌకర్యం లేదు. సులభ్ కాంప్లెక్సులకు మరమ్మతులు చేయించి, నీటి సౌకర్యం అందించి ఉపాధి కొనసాగేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● ప్రధాన డిమాండ్లు ఇవే

కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సింగరేణి సులభ్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో సింగరేణివ్యాప్తంగా ఉన్న సులభ్ కాంప్లెక్సుల కార్మికులు గురువారం ధర్నా చేపట్టనున్నారు. వారి ప్రధాన డిమాండ్లు ఈ విధంగా ఉన్నాయి.

- పంజాబ్ నేషనల్ బ్యాంకు ద్వారా సులభ్ కాంప్లెక్సుల కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం అందించాలి.
- ఈఎస్, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- 8.33 శాతం బోనస్ ఇవ్వాలి.
- ఏడాది నుంచి పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్‌ను తక్షణం చెల్లించాలి.
- సులభ్ కాంప్లెక్సుల్లో పనిచేసే కార్మికులు సహజ మరణం పొందితే ఆ కుటుంబానికి 20 లక్షల రూపాయల పరిహారం ఇవ్వాలి.
- సులభ్ కాంప్లెక్సులకు మరమ్మతులు చేయించి, నీటి వసతి కల్పించి వారి ఉపాధికి ఎలాంటి ప్రమాదం లేకుండా చూడాలి.
- సులభ్ కార్మికులకు ప్రతి యేటా రెండు జతల బట్టలు, బూట్లు ఇవ్వాలి.
- ప్రతినెలా గ్లౌజులు, మాస్కులు, సబ్బులు ఇవ్వాలి.

యాజమాన్యం స్పందించాలి

డి. బ్రహ్మానందం, సింగరేణి సులభ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



సింగరేణి సులభ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నాం. సింగరేణి యాజమాన్యం నిర్వాహకులకు ఎక్కువ మొత్తంలో ఇస్తున్నా, ఆ డబ్బు కార్మికులకు చేరడం లేదు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. 8.33 శాతం బోనస్ ఇవ్వాలి. ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేయాలి. ఏరియర్స్ డబ్బులు చెల్లించాలి. యాజమాన్యం స్పందించి సులభ్ కాంప్లెక్సుల వద్ద పనిచేసే కార్మికులకు న్యాయం చేయాలి.



సింగరేణిలో సంక్షేమాధికారుల బదిలీలు

మందమర్రిటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న 39 మంది సంక్షేమాధికారులను యాజమాన్యం బదిలీ చేస్తూ కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా 14 రోజుల్లో బదిలీ అయిన ఏరియాల్లో రిపోర్టు చేయాలని పేర్కొంది. 11 ఏరియాలకు సంబంధించి బదిలీలు చేసింది. మందమర్రి ఏరియాలో జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ పీవో విశ్రాంత్‌కుమార్‌ను భూపాలపల్లి ఏరియాకు బదిలీ చేసింది. డీవైపీఎం మైత్రేయ బంధు, సత్యబోస్‌లుకొత్తగూడెం కార్పోరేట్ కార్యాలయంకు బదిలీ అయ్యారు. కేకే 5 గనిలో పనిచేస్తున్న సీనియర్‌పర్సనల్ మాస్కుల కార్తీక్ మందమర్రి జీఎం కార్యాలయంకు బదిలీ అయ్యారు. మరికొన్ని రోజుల్లో పర్సనల్ ఆఫీసర్ల బదిలీలు కూడా ఉన్నట్లు తెలుస్తుంది.

సింగరేణి మ్యూజియంను ఏర్పాటు చేయాలి

రామకృష్ణాపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి సిరులమాగాని సింగరేణి ప్రాంతంలో మ్యూజియం ఏర్పాటు చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, క్యాతన్‌పల్లి మాజీ సర్పంచ్ గురిజాల రవీందర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం రామకృష్ణాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నుంచి 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి చేరి వేల కోట్ల లాభాలు కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి చరిత్రను మ్యూజియం ఏర్పాటు చేయడం ద్వారా సంస్థ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పవచ్చునన్నారు. మొదట ఇల్లందు ఏరియాలో బొగ్గు నిక్షేపాలను కనుకొన్న అప్పటి అధికారి విలియం కింగ్ నుంచి మొదలుకొని భూగర్భగనులు, ఉపరితల గనులు మొదటి జనరల్ మేనేజర్ సీఅండ్‌ఎండీ ఇలా 200 డిపార్ట్‌మెంట్లను కలిగి ఉన్న సంస్థ యొక్క గొప్పతనాన్ని మ్యూజియం ద్వారా ప్రదర్శించవచ్చునని రవీందర్‌రావు అన్నారు.

అదే విధంగా నేటి తరానికి తట్టా చెమ్మస్ లాడీస్ నాటి కాలంనాటి క్యాంటీన్ టోపీ లైట్లు , బూట్లు అనేక రకాలైన పరికరాలను ప్రదర్శనకు వీలుగా మ్యూజియం ఏర్పాటు అవసరం ఎంతైన ఉందన్నారు. వెంటనే మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అడ్వకేట్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ద్వారా మెరుగైన వైద్యం అందించాలి

శ్రీరాంపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్యం అందించాలని భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్‌రావు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట బధవారం ఒక్క రోజు దీక్ష నిర్వహించి డైరెక్టర్(పా) కె. వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా సంస్థ నిర్ధారించిన ఉత్పత్తి సాధిస్తున్నారన్నారు. వేల కోట్ల రూపాయలు అర్జించే సంస్థ ఉద్యోగుల సంక్షేమం నుంచి పక్కకు తప్పుకుంటోందని ఆరోపించారు. ఇందులో భాగంగా కంపెనీ ఆస్పత్రులకు వెళ్తే ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని అన్నారు. ఫలితంగా సంస్థకు ఆర్థిక నష్టంతో పాటు కార్మికులకు సరైన వైద్యం అందడం లేదన్నారు. అంతేకాకుండా మందుల సరఫరా సక్రమంగా జరగడం లేదని, దీనివల్ల రక్తపోటు, మధుమేహం ఉన్న వారికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఆధ్వర్యంలో మెడికల్ బోర్డు నిర్వహించాలని, ఐఎంఈ, పీఎంఈలలో కార్మికులను వేధించవద్దని, కంపెనీ ఆస్పత్రుల్లో అన్ని రకాల స్పెషలిస్టులను నియమించాలని కోరారు. అన్ని ఏరియాల్లో క్యాత్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని, సీపీఆర్ఎంఎస్ కార్డు ఉన్న వారికి నచ్చిన ఆస్పత్రిలో వైద్యం పొందేలా చర్యలు చేపట్టాలని, రిఫరల్ విధానంలో సరళ పద్ధతులు అమలు చేయాలని వినతిపత్రం డైరెక్టర్(పా)కు అందించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి, సురేందర్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేష్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, అన్వేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్(పా) కె వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోవధను నిషేధించాలి

బెల్లంపల్లి, జూన్4 (ఆంధ్రజ్యోతి): బక్రీదు పండుగ రోజు గోవధను నిషేధించాలని హిందు ఉత్సవ సమితి వ్యవస్థాపకులు కోడి రమేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా బక్రీదు పండగ రోజున గోవద చేస్తున్నారని సంబంధిత అధికారులు గోవధను నిషేధించేందుకు చర్యలు తీసుకోవా లన్నారు. పోలీసు, పలుశాఖల అధికారులు గోవద చేపట్టే వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గోవద చేస్తే చర్యలు తీసుకుంటామని సూచించాలని పేర్కొన్నారు. నాయకులు మురళీ, మనోహర్, శ్రీనివాస్, వేణు, పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

మందమర్రిటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన ఎనగందుల స్వాతి అనే మహిళ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుంది. ఈ ఈవిషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన రూ. 5 లక్షల ఎల్‌వో సీని మంజూరు చేయగా ఎల్‌వోసీని బుధవారం కాంగ్రెస్ నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, సుధాకర్‌లు మహిళకు అంద జేశారు. ప్రజలు సమస్యల్లో ఉంటే వారిని ఆదుకోవడంతో ఎమ్మెల్యే ముందుంటారని తెలిపారు. నాయకులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్లు వేగంగా నిర్మించుకోవాలి

మందమర్రిరూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్లను వేగంగా నిర్మించుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం ఆదిల్‌పేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతగా చేపట్టుకోవాలని సూచించారు. దశల వారీగా నిర్మిస్తే బిల్లులు వస్తాయని ఆయన సూచించారు.

కేటీఆర్‌ను కలిసిన పట్టణాధ్యక్షుడు


మందమర్రిటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్‌పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా అమెరికాలో పర్యటిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జె. రవీందర్ కుటుంబ సభ్యులతో బుధవారం డల్లాస్‌లో కలిశారు. ప్రవాస భారతీయులతో పార్టీ రజతోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయని తెలిపారు.

పర్యావ‘రణం’





అటవీ ప్రాంతం



పరిశ్రమ ద్వారా వస్తున్న పొగ

- అంతరించిపోతున్న అడవులు...
- పెరుగుతున్న కాలుష్యం...
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

నస్పూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) :

అడవులు అంతరించిపోతున్నాయి..కాలుష్యం పెరుగుతోంది.. ఒకప్పుడు ప్రపంచంలోనే ఎక్కువగా అడవులు కలిగిన దేశంగా భారతదేశం విరాజిల్లింది. ఇప్పుడు విచక్షణ రహితంగా తమ అవసరాల కోసం వృక్షాలను నేలకూల్చడంతో అడవులు అంతరించిపోతున్నాయి. దీంతో వన్యప్రాణుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. చెట్ల నరికివేతతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. వర్షాలు కురవక.. కరువుతో అల్లాడే పరిస్థితి ఏర్పడింది. నిత్య జీవితంలో మనిషి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాడు. దీనికి తోడు పర్యావరణ కాలుష్యం కూడా అ నారోగ్యాల పాలు చేస్తోంది. వాతావరణంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నా జీవితాల్లో మార్పులు సం భవిస్తాయి. మరోవైపు ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పె రిగి అనర్థానికి దారితీస్తోంది. ఈ నెల 5న గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

● సహజ వనరుల విధ్వంసం...

సహజ వనరులను నాశనం చేస్తూ మనిషి స్వార్థ ప్రయోజనాలకు ప్రకృతిని పణంగా పెడుతున్నాడు. ఒక చోట జరిగిన విధ్వంసం అన్ని ప్రాంతాలపై పడుతుందన్న జ్ఞానం మనిషిలో లేకపోవడమే ప్రధాన సమస్య. సహజ వనరుల చిన్నాభిన్నంతో కాలం గతి తప్పి కురవాల్సిన సమయంలో వర్షాలు కురవడంలేదు. వ్యవసాయ రంగంలో పంటలు చేతికందిన సమయంలో అకాల వర్షాలు కురిసి పంటలకు నష్టం కలిగిస్తున్నాయి. ఈ ప్రభావం జీవజాతులపై పడి చాలా జాతులు ఆహారం కొరత కారణం, కాలుష్యం ప్రభావంతో అంతరించి పోయాయి. పచ్చదనాన్ని కొల్లగొట్టి ప్లాస్టిక్‌వనాన్ని పెంచుకుంటే వాతావరణంలో సమతుల్యత దెబ్బతిని కరువు కాటాకాలు, ప్రళయాలు సంభవిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి ఆస్తుల నష్టం కలిగిస్తున్నాయి. ప్రధానంగా వ్యవసాయరంగంలో మితిమీరిన ఎరువులు, పురుగు మందుల వాడకం కారణంగా భూసారం దెబ్బతిని వాతావరణంలో మార్పులకు కారణమవుతున్నాయి.

● సంక్షోభంలో పర్యావరణం

- గుండేటి యోగేశ్వర్, పర్యావరణవేత్త- నస్పూర్



ప్రస్తుతం పర్యావరణం సంక్షోభాన్ని ఎదుర్కొటుంది. పర్యావరణ కాలుష్యం అనుబాంబు కంటే ప్రమాదక రమైంది. మనిషి వికృత చేష్టల కారణంగా కోట్లాది జీవ జాతులు జీవించే హక్కును హరించి వేస్తుంది. సహజ వనరులు దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. జీవుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. పర్యా వరణంలో మమేకమై జీవనం సాగించాల్సిన మానవుడు క్రమక్రమంగా ఇతర జీవుల ఉనికి పెను ప్రమాదాన్ని, విధ్వంసాన్ని కలిగిస్తున్నాడు. భూగోళంపై అధిక వేడి పెరిగినం దున మంచు పర్వాతాలు సైతం కరిగిపోయే పరి స్థితి ఏర్పడింది. మనిషి స్వార్థం విడి పర్యావరణ పరి రక్షణ కృషి చేయాలి.

● గాలి, నీరు కలుషితం...

ప్రధానంగా భూగోళంపై జీవిస్తున్న మానవులకు, ఇతర ప్రాణులకు గాలి, నీరు, ఆహారం ఎంతో ముఖ్యమైనవి. జీవకోటికి అవసరమైన నీరు కలుషితం అవుతోంది. దీని కారణంగా ఎన్నో సమస్యలు ఉత్పన్నమైన వాటిపై దృష్టి సారించడం లేదు. పరిశ్రమలు, విచ్చల విడిగా పెరిగిన వాహనాలు వాటి వలన వచ్చే పొగ, దుమ్ము కారణంగా గాలి కలుషితం అవుతోంది. భూగోళంపై జీవిస్తున్న మానవుడికి అన్ని రకాల జీవులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉంది. పూర్వం మానవుడు తన అవసరాలను తీర్చుకోవడానికి ప్రకృతిపై ఆధారపడి జీవించేవాడు. కానీ నేటి మానవుడు ఆరం భం నుంచే ప్రకృతిని శాసిస్తూ మనిషి మనుగడ కోల్పో డవానికి కారణమైయ్యాడు.

● నేపథ్యం...

జూన్ 5, 1972లో పర్యావరణానికి సంబంధించిన సమావేశాన్ని ఐక్యరాజ్యసమితి మొట్టమొదటి సారి నిర్వ హించింది. 1973లో తొలిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా 1972లో యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్(యూఎన్‌ఈపీ) ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి ప్రతి ఏటా పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



పుట్టగొడుగుల్లా ప్రైవేట్ బడులు..

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యాయులుగా నియమిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో డీఈడీ శిక్షణ పొంది ఉన్నట్లయితే విద్యార్థుల మనసత్వాన్ని ఎరిగి వారిని విద్యపట్ల ఆకర్షితులను చేసే అవకాశం ఉంటుంది. అలాగే ఉన్నత తరగతులు బోధించే ఉపాధ్యాయులకు తప్పని సరిగా బీఈడీ, తదితర ట్రైనింగ్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. అయితే ఎలాంటి ట్రైనింగ్ లేకున్నా, కేవలం అకాడమిక్ అర్హతలతోనే ఉపాధ్యాయులుగా నియమి స్తున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు..

డీఈవో యాదయ్య

ప్రభుత్వ గుర్తింపు లేకుండా పాఠశాలలు నెలకొల్పితే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో చదివే విద్యార్థులకు భవిష్యత్‌లో బోనఫైడ్ సర్టిఫికెట్‌లు అందక ఇబ్బందులు ఎదుర్కోవలసి వ స్తుంది. అలాగే ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలి. ఈ విషయంలో తనిఖీలు నిర్వహిస్తాం. ఆటస్థలాలు లేని పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తాము. వేల రూపాయలు దారపోసి చదివించే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ గుర్తింపు ఉండి అన్ని రకాల సౌకర్యాలు ఉన్న పాఠశాలల్లోనే చేర్పించాలి.

రెండు రోజుల్లో కాలేజీకి.. అంతలోనే కానరాని లోకాలకు..

స్నేహితులతో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



హర్షవర్ధన్(ఫైల్)

మంచిర్యాలక్రైం, జూన్4(ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజుల్లో ఆ విద్యార్థి హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో ఇంటర్ చదివేందుకు వెళ్లాల్సి ఉంది. కానీ విధి రాత మార్చలేమన్నట్టు ఈత సరదా ఆ విద్యార్థిని తిరిగిరాని లోకాలకు తీసుకెళ్లింది. కొడుకును కాలేజీలో చేర్పించేందుకు అన్నీ సిద్ధం చేసుకున్న ఆ తల్లిదండ్రులకు ఇక తమ కొడుకు లేడన్న విషయం తెలిసి కన్నీళ్ల పర్యంతమయ్యారు. మంచిర్యాల పట్టణం జాఫర్‌నగర్‌కు చెందిన సాదుల హర్షవర్ధన్(15) స్నేహితులతో కలిసి సరదా కోసం వెళ్లి కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల, ఎస్ఐ తిరుపతి తెలిపిన పూర్తి వివరాల ప్రకారం పదోతరగతి పూర్తి చేసుకున్న హర్షవర్ధన్ తన స్నేహితులతో కలిసి సరదాగా బయటకు వెళ్లాడు. ఇంటర్ కాలేజీకి వెళితే మళ్లీ కలుసుకోలేమంటూ ఆరుగురు స్నేహితులు కలిసి సరదాగా గడిపేందుకు క్వారీకి వెళ్లారు. అనంతరం హర్షవర్ధన్‌తో పాటు మరో మిత్రుడు సంగీత్ క్వారీ కొలను లోకి దిగారు. సంగీత్ బయటికి వచ్చినప్పటికీ హర్షవర్ధన్ ఈతరాక నీటిలోనే మునిగిపోయారు. స్నేహితులు సాయంత్రం వరకు వేచి చూసి భయంతో ఇళ్లలోకి వెళ్లిపోయారు. హర్షవర్ధన్ తండ్రి ప్రసాద్ ప్రైవేటు బ్యాంక్‌లో పని చేస్తుంటాడు. తల్లి లావణ్య ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఇంటికి తిరిగి వచ్చేసరికి కుమారుడు కనిపించకపోవడంతో ఆరా తీయగా స్నేహితులతో కలిసి బయటకు వెళ్లారని తెలుసుకున్నారు. ఎక్కడ వెతికినా ఆచూకి తెలియకపోవడవంతో చివరకు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు హర్షవర్ధన్‌తో వెళ్లిన స్నేహితులను విచారించగా హర్షవర్ధన్ నీటిలో మునిగిపోయాడని తెలపడంతో మంగళవారం రాత్రి క్వారీకి వెళ్లి చూశారు. ఘటనా స్థలంలో హర్షవర్ధన్ దుస్తులు, చెప్పులను విడిచి నీటిలోకి దిగినట్లు గుర్తించారు. ద్విచక్ర వాహనం సైతం క్వారీ దగ్గరే ఉండడంతో బుధవారం ఉదయం గజ ఈతగాళ్లతో వెతికించడంతో మృతదేహం లభ్యమైంది. ఎస్ఎస్‌సీ పూర్తి చేసుకున్న హర్షవర్ధన్ హైదరాబాద్‌లో ఓ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నాడు. మరో రెండు రోజుల్లో వెళ్లాల్సి ఉండగా శవమై తేలాడంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించాడు. చేతికొచ్చిన కొడుకు శవమై తేలడంతో జాఫర్ నగర్‌కాలనీలో విషాదచాయలు అలుముకున్నాయి. హర్షవర్ధన్‌కు సోదరుడు ధనుష్ ఉన్నారు. బాధితుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ బడులను బతికించుకుందాం

జైపూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులను బతికించు కుందామని బడిబాటను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి బోనగిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని విద్యావనరుల కేంద్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఐకేపీ, ఇతర మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిని బలోపేతం చేయడానికి ఈ నెల 6 నుంచి 19 వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రతి పాఠశాల ఆవాసం పరిధిలోని మహిళ సంఘాలతో విద్యావంతులతో, యువకులతో, అంగన్‌వాడీ టీచర్లతో చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్, ఎంఆర్‌సీ సిబ్బంది సింధూర, సీఆర్‌పీలు రాజన్న, జనార్ధన్, శ్రీధర్, సీసీవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు

దండేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడెం అయ్యప్ప దేవస్థానం 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అయ్యప్ప స్వామి మందిరంలో ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. అఖండ దీపారాధన, గణపతి పూజ, స్వస్తి పుణ్యా హ వాచనం, పంచా మృతాలతో పంచ సూక్తాలతో అయ్యప్ప స్వామికి అభిషేక కార్యక్రమం, లక్ష్మీగణపతి నవగ్రహ పంచసూక్త హోమాలు ఆలయ వ్యవస్థాపకులు గురుస్వామి శ్రీమన్ చక్రవర్తుల పురుషోత్తంచార్యులు, వేద పండితులు, ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ట్రస్టు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ శివకృష్ణ

తాండూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంపలపల్లి గ్రామంలో బుధవారం బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ కోట శివకృష్ణ రైతులకు వ్యవసాయంలో నూతన విధానాలు, రైతులకు తక్కువ యూరియా వాడడం, సాగు ఖర్చును తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు ప్రియ సుగంధి, తిరుపతి, ఏవో సుష్మ, ఏఈవోలు ధనలక్ష్మీ, ఉదయ్‌కుమార్, మ్యాట్రిక్స్ కంపెనీ సీఈవో, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే భూభారతి సదస్సులు



బుద్దారం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్య లను పరిష్కారానికే భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం చెన్నూరు మండలంలోని బుద్దారంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సును తహసీల్దార్ మల్లికార్జున్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర మాట్లాడుతూ దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 20 వరకు జిల్లాలోని గ్రామాల్లో సదస్సులు ఉంటాయని, భూసమస్యలున్న ఉన్న రైతులు దరఖాస్తులను అందజేయాలన్నారు. అనంతరం చెన్నూరు పట్టణంలో కొనసాగుతున్న అమృత్ 2.0 పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. అమృత్ 2.0 ద్వారా తాగునీటిని అందించేందుకు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నెన్నెల : నూతన రెవెన్యూ చట్టం భూభారతి అమలులో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. ఆవడంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో బుధవారం పాల్గొని మాట్లాడారు. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి సమస్యలను సత్వరం పరిష్కరిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఎంఆర్‌ఐ సు లోచన పాల్గొన్నారు.

నస్పూర్ : భూ భారతి రెవెన్యూ సదస్సు గ్రామ సభలో భాగంగా నస్పూర్ పట్టణంలోని తీగల్ పహాడ్, తాళ్లప ల్లిలో రెండవ రోజు గ్రామ సభలు జరిగాయి. రైతులు వివిధ భూ సమస్యలపై నాలుగు ఆర్జీలను అందిం చారు. తీగల్ పహాడ్‌లో ఒకటి, తాళ్లపల్లిలో మూడు దరఖాస్తులను అధికారులకు అందించారు. తహసీల్దార్ సంతోష్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్‌ఐలు ప్రశాంత్, చందర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: భూభారతి రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ కృష్ణ అన్నారు. మండలంలోని అంకూస గ్రామంలో రెవెన్యూ సదస్సులో భాగంగా మాట్లాడారు. భూములకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యను పరిష్కరించడానికి సదస్సులు నిర్వహిస్తున్నామని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌ఐ మురళీధర్‌రావు పాల్గొన్నారు.

దండేపల్లి: భూభారతి చట్టం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే అన్నారు. బుధవారం మండలంలోని కుందే ళ్లపహాడ్, లక్ష్మీ కాంతపూర్ గ్రామాల్లోని రెవెన్యూ సదస్సు ద్వారా రైదరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ, సీనియర్ అసిస్టెంట్ ముత్తె లావణ్య, ఆర్‌ఐ భూమన్న, పాల్గొన్నారు.

హాజీపూర్: నంనూర్, నర్సింగాపూర్ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కొన్ని సమస్యలకు పరిష్కారం చూపారు. ఆర్‌ఐలు ప్రభు, మంగ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: రెండవ రోజు తహసీల్దార్ భోజన ఆధ్వర్యంలో పెద్దనపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా డిప్యూటి తహసీల్దార్ అంజయ్య ఆధ్వర్యంలో కోనూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పెద్దనపల్లిలో 25 దరఖాస్తులు, కోనూరులో 7దరఖాస్తులు వచ్చాయి.

మందమర్రిరూరల్ : భూసమస్యల పరిష్కారం కోసమే భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నా మని తహసీల్దార్ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. పొన్నారం, చిర్రకుంట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. విరాసత్, పేరు మార్పు తదితర సమస్యల పరిష్కారం కోసం సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. చిర్రకుంటలో 10, పొన్నారంలో 2 దరఖాస్తులు వచ్చాయి.

ఓరియంట్ ఎన్నికలపై నేడు కీలక సమావేశం

కాసిపేట, జూన్4 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో గుర్తింపు సంఘం ఎన్నికలపై గురువారం ఆదిలాబాద్ డీసీఎల్ కార్యాలయంలో కీలక సమావేశం జరుగనుంది. ఇది వరకే ఓరియంట్ ఎన్నికలపై ఈ నెల 5న డిప్యూటి లేబర్ కమిషనర్ సమావేశం నిర్వహించిననున్నట్లు నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈసారి జరిగే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐదు యూనియన్లు అర్హత సాధించాయి. యూనియన్లకు ఎన్నికల గుర్తులు కేటాయించి ఎన్నికల తేదీని ప్రకటించనున్నారు. గురువారం ఆదిలాబాద్‌లో నిర్వహించే సమావేశానికి కార్మికు లను తరలించేందుకు నాయకులు పోటీపడుతున్నారు. గురువారం ఎన్నికల తేదీ ప్రకటించిన తరువాత ఎన్ని కల హడావిడి ఏ రేంజ్‌లో ఉండబోతుందో వేచి చూడాల్సిందే.

రైతులకు విత్తనాలు పంపిణీ

చెన్నూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూర్‌లోని ఏడీఏ కార్యాలయంలో నాణ్యమైన విత్తనం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా బుధవారం రైతులకు జిల్లా వ్యవసాయాధికారి కల్పన విత్తనాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ వరి కేఎస్ ఎం 10 కిలోల బ్యాగు, పెసర ఎంజీజీ 8 కిలోల బ్యాగులను గ్రామానికి ముగ్గురు చొప్పున రైతులకు అందజేశామన్నారు. మండలంలో మొత్తం 54 వరి, 27 పెసర విత్తన బస్తాలను అందజేయడం జరిగిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో విత్తనోత్పత్తి చేసి తద్వారా వచ్చిన విత్తనాలను అదే గ్రామంలోని రైతులకు అందేలా చూస్తామన్నారు. ఏడీఏ బానోత్ ప్రసాద్, బెల్లంపల్లి ఉద్యానవన శాస్త్రవేత్త స్రవంతి, ఏవో యామిని, ఏఈవోలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

మంచిర్యాలకలెక్టరేట్, జూన్4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. నిర్మాణ దశలు పూర్తి అయిన మేరకు బిల్లులు సమర్పించాలని తెలిపారు. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీర్ రామ్మోహన్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనర్వహణ అధికారి గణపతి, ఏఈఈ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

●ఉమ్మడి జిల్లా 2024-2025 ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్ విభాగంలో అత్యధిక మార్కులు సాధించిన జన్నారం మండలంలోని కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాథోడ్ యోగేశ్వర్, ఏల్పుల నరేందర్, అనిల్‌లను బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్ దీపక్, డీఈవో యాదయ్య అభినందించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

తాండూర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూర్ సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రేచిని గ్రామంలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఫెర్టిలైజర్ దుకాణాల యాజమానులు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మవద్దని, నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలు వాడడం భూసారం తగ్గుతుందని రైతులు నకిలీ విత్తనాలను వాడవద్దని సూచించారు. నకిలీ విత్తనాలు వాడి పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి పరిహారం రాదన్నారు. ఫెర్టిలైజర్ దుకాణాల యాజమానులు రైతులు కొన్న విత్తనాలు, ఎరువులకు రశీదులు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్, శిక్షణ ఎస్ఐ అనూష, ఏడీఏ రాజనరేందర్, మండల వ్యవసాయాధికారి సుష్మ పాల్గొన్నారు.

కన్నెపల్లి: ఫెర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలుంటాయని సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. బుధవారం కన్నెపల్లిలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

స్టాకు రిజిష్టర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, కొన్న వాటికి రశీదులు అందించాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే చర్యలుంటాయన్నారు. ఆయన వెంట ఏవో సాయి ప్రశాంత్, ఎస్ఐ గంగారాం, సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

వేమనపల్లి : మండలంలో వన మహోత్సవం విజయవంతం కోసం మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీవో కుమారస్వామి పేర్కొన్నారు. బుధవారం వేమన పల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికా రులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీవో సత్య ప్రసాద్, ఏపీఎం ఉమారాణి ,డిప్యూటి రేంజ్ ఆఫీసర్ రూపేష్, ఈసీ మధుకర్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను బుధవారం రిటైర్డు కార్మిక సంఘం నాయకులు హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పద్మభూషణ్ అవార్డు వచ్చిన సందర్బంగా శాలువాలతో సన్మానించారు. అనంతరం సింగరేణి రిటైర్డు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. సంఘం నాయకులు వాసాల శంకర్, ఆసం శంకర్, శ్రీనివాస్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: మంచిర్యాలజిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం జాతీయ నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ బుధవారం రాత్రి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జన్నారం: జన్నారం మండలం ఎస్ఐగా గొల్లపల్లి అనూష బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడేందుకు ఎళ్లవేలలా కృషి చేస్తానన్నారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెదురు బొంగులు తరలిస్తున్న వ్యాన్‌ల పట్టివేత

జన్నారం,జూన్4 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో గల ఇందన్‌పల్లి రేంజ్‌పరిధిలో గల కిష్టాపూర్ గ్రామం గుండా అక్రమంగా వెదురుబొంగులు తరలిస్తున్న వ్యాన్లను పట్టుకున్నారు. మంగళవారం రాత్రి నిర్మల్ జిల్లా ఇస్లాంపుర అటవీప్రాంతం నుంచి రెండు వ్యాన్‌లలో ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో గల కిష్టాపూర్ గ్రామం గుండా వెదురుబొంగు జగిత్యాల జిల్లా ధర్మపురి, నిర్మల్ జిల్లాలకు వెదురు బొంగు తరలిస్తున్నారు. పక్క సమాచారం మేరకు కొందరు విలేకరులు, కిష్టాపూర్ గ్రామస్తులు వ్యాన్‌లను ఆపి వివరాలు అడుగ్గా వ్యాన్ డ్రైవర్ దురుసుగా సమాధానం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

ఎఫ్ఆర్‌వో సుష్మరావు ఆదేశాల మేరకు డిప్యూట్ రేంజ్ అధికారి మమత, బీట్ అధికారులు లాలు బాయి, తిరుమలేశ్‌లు చేరుకొని వ్యాన్‌లను జన్నారం రేంజ్ కార్యాలయానికి తరలిం చారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

బెజ్జూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. బుధవారం మండలంలోని రేచిని గ్రామంలో తహసీల్దార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆలయ షెడ్ నిర్మాణానికి భూమి పూజ

తిర్యాణి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ఆవరణలో రేకుల షెడ్ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనిల్‌గౌడ్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌గౌడ్, బి శంకర్‌గౌడ్, వెంకటేశం, బి శంకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయంలో వినతి

ఆసిఫాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలో 30 సంవత్సరాలుగా లాండ్రిషాప్ పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న తన షాపును అకారణంగా కౌటాల పంచాయతీ కార్యదర్శి తొలగించారని తనకు న్యాయం చేయాలని కోరుతూ కొండపర్తి రాజయ్య బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఏవో కిరణ్‌కుమార్, జిల్లా బీసీ సంక్షేమాధికారి సజీవన్‌కు వినతి పత్రం అందజేశారు. లాండ్రీ షాప్ వేరే చోట ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు

కెరమెరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం సాకడ గ్రామంలో అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ఎనిమిది ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవారికి ఇళ్లు నిర్మించడం ప్రజాప్రభుత్వ లక్ష్యమన్నారు. లబ్ధిదారులు అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మునీర్ అహ్మద్, కుసుంరావు, లింబారావు, జలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమెకు అక్షర వెలుగులు



ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అతివల్లో అక్షరాస్యత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏటా నిరక్షరాస్యుల గుర్తింపునకు సన్నద్ధమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చదవడం, రాయడం రానివారిని గుర్తించి వారికి పాఠాలు చెప్పించడమే ప్రధాన లక్ష్యం. కాగా ఈసారి ప్రధానంగా మహిళా సంఘాల సభ్యులపై దృష్టి సారించింది. 19 ఏళ్లు నిండిన వారిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా నిర్దేశించారు. ఉల్లాస్(అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ అన్ ఇన్ సొసైటీ) పేరిట ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మహిళా స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీ) నిరక్షరాస్యులను గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు. జిల్లా విద్యాశాఖ, డీఆర్డీవో అధికారులు ఉల్లాస్‌ను సంయుక్తంగా చేపడుతున్నారు.

- సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లాలో 22,494 మంది నిరక్షరాస్యులు

స్వయం సహాయక సంఘాల్లో..

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో 22,494 మంది నిరక్షరాస్యులను గుర్తించారు. వారి వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది. సర్వే వివరాలను, వారు చదివిన తరగతుల వారీగా పొందుపర్చారు. పదో తరగతి లోపు మానేసిన వారిని సార్వత్రిక పది, పదో తరగతితో ఆపేస్తే సార్వత్రిక ఇంటర్ చేసేలా ప్రోత్సహిస్తారు. ఇంటర్ ఉత్తీర్ణత ఉంటే డిగ్రీ చేయించాలని నిర్ణయించారు. పూర్తిగా నిరక్షరాస్యులు ఉంటే సంఘంలోనే చదువు వచ్చిన వారిని వలంటీరుగా నియమించి అక్షరాలు నేర్పిస్తారు. ఒకవేళ సంఘాల్లో ఎవరు చదువుకున్నవారు లేకుంటే పిల్లలతో ఈ ప్రక్రియను కొనసాగించాలని నిర్ణయించారు. తద్వారా మహిళా సంఘాల సభ్యులు పూర్తిగా అక్షరాస్యత పెరిగి భవిష్యత్‌లో ఉపాధి పొందవచ్చు.

రోజుకు రెండు గంటల చొప్పున...

నిరక్షరాస్యులకు రోజులో రెండు గంటల చొప్పున 200 గంటలు బోధిస్తారు. తరగతుల నిర్వహణకు పాఠశాలలు, ప్రభుత్వ కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి డిజిటల్ కంటెంట్‌తో కంప్యూటర్, టీవీలను సమకూర్చనున్నారు.

ఓపెన్ స్కూలింగ్ ద్వారా బోధన..

కేంద్ర ప్రభుత్వం 2009లో సాక్షర భారత్ కార్యక్రమాన్ని పదేళ్ల కాల పరిమితితో ప్రారంభించగా 2018 లోనే ముగిసింది. ఆ తర్వాత 2020లో కొత్త విద్యా విధానం అమలులోకి వచ్చింది. దీని ద్వారా అందరికి విద్య అందించేందుకు 2022 నుంచి 2027 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్‌ఐఎల్‌పీ)లో భాగంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ 'ఉల్లాస్'కు రూపకల్పన చేసింది. ప్రాథమిక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత కల్పించడంతో పాటు ఆరోగ్య సంరక్షణ, కుటుంబ సంక్షేమంపై అవగాహన, జీవన నైపుణ్యాలు పెంపొందించి తద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా 'ఉల్లాస్'ను తెచ్చింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోను కార్యాచరణ ప్రారంభమైంది. 100 శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యానికి అనుగుణంగా ముందుకు వెళుతోంది.

వంద శాతం అక్షరాస్యత సాధనే లక్ష్యం

నాగరాజు, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్



సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా కార్యాచరణ తయారు చేశాం. ఇది వరకే గ్రామ సభలు నిర్వహించి ప్రత్యేక సర్వే చేపట్టాం. ఇందులో ఏఏ స్థాయికి చెందిన వారు ఎంత వరకు చదివి ఉన్నారో గుర్తించాం. పూర్తి స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయ వంతం చేసేందుకు మండల, జిల్లా స్థాయి అధికారులను సమన్వయ పరుస్తాం. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలు సైతం భాగస్వాములు కావాలి.

బాధ్యులపై చర్యలు తప్పవు: డీఆర్డీవో


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో దత్తారాం

కౌటాల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూలీల మేలు కోసం చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో ఎక్కడ తప్పిదాలు జరిగినా బాధ్యులపై చర్యలు తప్పవని డీఆర్డీవో దత్తారాం హెచ్చరించారు. బుధవారం కౌటాల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి మధ్య కాలంలో జరిగిన రూ.7.5 కోట్ల పనులకు సంబంధించిన ఆడిట్ ప్రత్యేక బృందాలు తనిఖీ చేశాయన్నారు. ఉపాధిహామీ పనులను సమర్థవంతంగా చేయాల్సిన బాధ్యత అధికారులు, సిబ్బందిపై ఉందన్నారు. అదే సమయంలో రైతులు, ప్రజలు ఉపాధి హామీ కింద చేసే అభివృద్ధి పనులు చెరిపేయడం, తొలగించడం చేసేటప్పుడు ఖచ్చితంగా ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. దీని వల్ల ఆడిట్ సమయంలో ఇబ్బందులు ఉండవన్నారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు రైతులకు అవసరమైన అభివృద్ధి పనులు చేస్తామని పేర్కొన్నారు. చిన్న చిన్న తప్పిదాలు మినహా ఈ ఆడిట్‌లో బయట పడకపోవడం మంచి విషయమని, చిన్నవాటిని సైతం మళ్లీ జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ ఆడిట్ బృందం ఎస్ఆర్పీ రవి, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్, ప్లాంటేషన్ మేనేజర్ అంజనేయులు, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి రమేష్, ఎంపీడీఓ రమేష్, ఏపీఎం పూర్ణిమా, ఏపీఎం ముక్తేశ్వర్, ఈసీ సంతోష్, ఎంసీవో సాయి తదితరులు పాల్గొన్నారు.

చెరువును, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలి

చింతలమానేపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): డబ్బా గ్రామంలోని ఎక్స్ రోడ్డు వద్ద చెరువుకు సంబంధించిన భూమి ఆ భూమికి సంబంధించిన రికార్డు తెలుపాలని కోరుతూ డబ్బా గ్రామానికి చెందిన యువకులు బుధవారం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎరువు దగ్గర ఉన్న భూమి, ఆ భూమికి సంబంధించిన పూర్తి వివరాలను చెరువుకు సంబంధించిన భూమి సర్వే నెంబర్ ప్రైవేటు వారి పేరున ఉన్నదా లేదా ఇరిగేషన్ పేరున ఉన్నదా లేదా ఇతర వారి పేరున ఉన్నదా అనే విషయాన్ని గ్రామస్తులకు తెలపాలని కోరుతూ భూభారతి రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సాగర్, సంతోష్, చిలుకయ్య, ప్రకాష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న డబ్బా గ్రామస్థులు

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి


దహెగాంలో సమీక్షలో పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలందరిని పాఠశాలలో చేర్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో సుభాష్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల లెవల్ కన్వర్షెన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలో చదువుతున్న పిల్లలను ఖచ్చితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని, యూనిఫాం ఖచ్చితంగా ఈ నెల 12వ తేదీ వరకు పాఠశాలలకు అందేలా చూడాలని అన్నారు. సమావేశంలో మున్సిపల్ కమీషనర్ భుజంగరావు, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

దహెగాం: బడి ఈడు పిల్లలందరిని బడిలో చేర్పించాలని తహసీల్దార్ మునావర్‌షరీఫ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడి ఈడు పిల్లలందరికి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఎంపీడీవో ఆల్బర్ట్, ఎంఈవో శ్రీనివాస్, ఏపీఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఈవో వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిమానేసిన పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని, పిల్లల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి బడికి వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఏపీఎం దుర్గయ్య, చైల్డ్ వెల్ఫేర్ అధికారి ఉన్నారు.

పాత కక్షలతోనే యువకుడి హత్య

- ఏడుగురు నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామానుజం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామానుజం

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో మంగళవారం సాయంత్రం పాత కక్షలతోనే సయ్యద్ దావూద్(18) అనే యువకుడి హత్య జరిగిందని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తెలిపారు. కాగజ్‌నగర్ రూరల్ పోలీసుస్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలోని సీ బాపు కాలనీ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో సయ్యద్ దావూద్‌తో పాటు అతడి స్నేహితులు మద్యం సేవిస్తున్నారు. అప్పుడే అక్కడకు ఏడుగురు నిందితులు వచ్చారు. పాత కక్షలతో ఒక్కసారిగా గొడవ పడ్డారు. నిందితులు అంతా కలిసి మూకుమ్మడిగా బీరు సీసాలు, బండ రాళ్లతో తలపై మోది దావూద్‌ను చంపారు. మృతుడు దావూద్ కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేశారు. నిందుతుల్లో షేక్ అక్బర్ (కాపువాడ), షేక్ జమీర్ (నూరాని మసీదు), గిరిగుల రాజేశ్ (పోచమ్మ బస్తి), షేక్ జమీర్ (నూరాని మసీదు), దుర్వే రాఘవేంద్ర అలియాస్ అచ్చు (కాపువాడ), గోగర్ల రూపేశ్ (సి.బాపు కాలని), షేక్ రేయాన్ (నూరాని మసీదు)లను అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో పలువురిపై మావల, బోథ్, నిర్మల్, నిజామాబాద్, కాగజ్‌నగర్ టౌన్, ఆదిలాబాద్, ఈస్‌గాం పోలీసు స్టేషన్‌లో పలు కేసులున్నాయని తెలిపారు. నిందితుల వద్ద నుంచి బైక్, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్ రావు, ఎస్సై సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలానికి చెందిన నిమ్మబాయి, సలుగుపల్లికి చెందిన అంకుబాయి, బెజ్జూరుకు చెందిన శ్రీశైలంలకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన సుమారు రూ.58000 వేల విలువైన చెక్కులను ఎమ్మెల్సీ దండె విఠల్ బాధితులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నిరుపేదల కోసం సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. నిరుపేదలు ప్రతి ఒక్కరు సీఎం సహాయ నిధి పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సిడాం గణపతి, శ్రీవర్ధన్, విశ్వేశ్వర్‌రావు, జగ్గాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు త్వరగా పూర్తి చేయాలి

దహెగాం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగ వంతంగా పూర్తిచేయాలని డీసీవో రాథోడ్ బిక్కు ఆదేశించారు. బుధవారం దహెగాం మండలంలోని చంద్రపల్లి, ఖర్జీ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీవో మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17 రాగానే ప్యాడీ క్లీనర్‌లో తూర్పార పోసి కొనుగోలు వేగంగా చేపట్టి కేటాయించిన రైస్ మిల్లులకు పంపించాలన్నారు. ఆయన వెంట జూనియర్ ఇన్‌స్ట్రక్టర్ నవీన్, పీఏసీఎస్ కార్యదర్శి నారాయణ, వీపీసీ ఇన్ చార్జి నర్సింహగౌడ్, మాజీ సర్పంచ్ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సంత్ కబీర్ పురస్కారానికి అశోక్ ఎంపిక

వాంకిడి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సంత్ కబీర్‌దాస్ జయంతి సందర్భంగా ఈ నెల 11న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో క్రాంతి కారి సంత్ కబీర్ గ్రంథాలయ సమితి ఆధ్వర్యంలో సంత్ కవి మెగా ఫెస్టివల్ 2025 జరగనున్నది. ఇందులో భాగంగా సాహిత్య సామాజిక రంగంలో దేశవ్యాప్తంగా కృషి చేస్తున్న 20 మందిని సంత్ కబీర్ జాతీయ పురస్కారాలు 2025లకు ఎంపిక చేశారు. వాంకిడి మండల కేంద్రానికి చెందిన బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహల్కార్ అశోక్ ఎంపికైనట్లు నిర్వాహకులు, సంత్ కబీర్ గ్రంథాలయ అధ్యక్షుడు ప్రదీప్ ఫుల్జలే తెలిపారు. ఈ నెల 11న నాగ్‌పూర్‌లోని కామాటిలో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అశోక్‌ను బీఎస్‌ఐ, అంబేద్కర్ సంఘం నాయకులు జయరాం, సునీల్‌కుమార్, సందీప్, శ్యాంరావు, గోపినాథ్, విలాస్ తదితరులు అభినందించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

ఆదనపు కలెక్టర్ దీపక్ తివారి


అధికారులతో మాట్లాడుతున్న ఆదనపు కలెక్టర్ దీపక్ తివారి

జైనూర్, జూన్, 4 (ఆంధ్రజ్యోతి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. మండలంలోని లేండిగూడ, గౌరి కొలాంగూడ రాకపోకలు చేసే రోడ్డు మార్గంలో ఉన్న లో లేవల్ వంతెన, మండల కేంద్రంలో నిర్మించిన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ పనులను ఆదనపు కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలో మంజూరైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ఫాగింగ్ మిషన్ అందుబాటులో ఉంచుకోవాలని, రానున్న వర్షాకాలంలో పారిశుధ్య పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. అధిక వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్యంతో పాటు క్లోరినేషన్ కార్యక్రమంపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతం చేసేలా కిందిస్థాయి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన మొదటి మార్క్అవుట్ ఈ నెల 9లోగా పూర్తిచేయాలని ఆయన కోరారు. ఆదేవిధంగా గ్రామాల్లో లబ్ధిదారుల కుటుంబ వివరాలు జన్‌మన్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలో గర్భిణుల వివరాలను సేకరించి వారికి వర్షాకాలంలో ఇబ్బంది కలగకుండా తగిన వైద్యం అందేలా చూడాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులకు ఉపయోగకరమైన పనులు చేపట్టాలని, భూగర్భ జల శాతాన్ని పెంచేలా కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో హరితహారం కింద లక్షలాది మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జాదవ్ గున్వంత్‌రావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఈవో కోరేంగా ఆనంద్‌రావ్, ఏపీవో నగేష్, ఈసీ అంకుష్, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

ఆసిఫాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయూష్ డిస్ట్రిక్ డిప్యూటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత అన్నారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది వేడుకల సందర్భంగా జిల్లా ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం యోగా వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా సాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మహేష్, శిల్ప, నరేందర్‌రెడ్డి, వనిత, సిబ్బంది శంకర్, గౌతమి, శ్రీలత, ఇందిరా, సరిత, యోగా టీచర్ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


శ్రావణ్(ఫైల్)

సిర్పూర్(టి), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లవాడలో బన్ని శ్రావణ్(25) అనే యువకుడు బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి పలువురు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో చుట్టు పక్కల వారు ఇంట్లో గమనించారు. ఈ క్రమంలో ఉరికి వేలాడడాన్ని గమనించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై కమలాకర్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడికి ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. కాగా యువకుడు మృతికి గల కారణాలు తెలియరాలేదు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ యువకుడి బంధువులను పరామర్శించారు.

సామాజిక సేవల్లో తోడ్పాటు అందించాలి

కాగజ్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో చేపడుతున్న వివిధ సామాజిక సేవల్లో స్పర్శ ఫౌండేషన్ తోడ్పాటు అందించాలని కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్ అంజయ్య సూచించారు. బుధవారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో స్పర్శ ఫౌండేషన్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్లాస్టిక్ నివారణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. అలాగే స్వచ్ఛ మున్సిపాలిటీకి ఎంతగానో కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా స్పర్శ ఫౌండేషన్ డైరెక్టర్ మణిష్ మాట్లాడుతూ సామాజిక సేవలో పాల్గొనేందుకు స్పర్శ ఫౌండేషన్ ముందు ఉంటుందన్నారు. సమావేశంలో స్పర్శ అసిస్టెంట్ మేనేజర్ రేవతి, మధూకర్, సీహెచ్ సుశీల, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య తెలిపారు. బుధవారం కాగజ్‌నగర్ మున్సిపల్ హాలులో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక లారీ చౌరస్తా నుంచి ఎస్పీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ ప్రణీల్, మోతీరాం, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.


కమిషనర్‌తో భేటీ అయిన స్పర్శ ఫౌండేషన్ సభ్యులు

వియత్నాంలో కాగజ్‌నగర్ యువకుడి మృతి


అశ్రిత్(ఫైల్)

కాగజ్‌నగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వియత్నాం దేశంలో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ వాసి అశ్రిత్(21) రోడ్డు ప్రమాదంలో బుధవారం ఉదయం మృతి చెందాడు. తన ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వెళ్లుతున్న క్రమంలో అదుపు తప్పి గోడకు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందినట్టు అశ్రిత్ కుటుంబ సభ్యులు తెలిపారు. అశ్రిత్ వియత్నాంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అశ్రిత్ తండ్రి అర్జున్ కాగజ్‌నగర్‌లో క్లాత్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్టు తెలియటంతో వెంటనే వియత్నాం దేశానికి కుటుంబ సభ్యులు బయలుదేరి వెళ్లారు. అశ్రిత్ మృతదేహం తెప్పించేందుకు బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

బెజ్జూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బారెగూడ సమీపంలో వ్యవసాయ బావిలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ గుర్తించినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతుడు బారెగూడ గ్రామానికి చెందిన ఇస్తారిగా గుర్తించినట్లు తెలిపారు. మృతుడు ఆదివారం ఇంట్లో నుంచి మహారాష్ట్రలోని చప్రాలకు వెళ్తున్నట్లు చెప్పి ముంజంపల్లి గ్రామంలో శుభకార్యానికి వెళ్లి మద్యం సేవించి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు లక్ష్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.